
తెలుగు దిన పత్రిక
# ప్రజా జ్యోతి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
## ఖమ్మం
గురువారం 16-5-2024 | పేజీలు : 6



## రైతులకు నష్టపరిహారం చెల్లించాలి.

వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కి వినతిపత్రం సమర్పించిన సిపిఐ నాయకులు.

2లో



# డీసీఎంఎస్ మాజీ చైర్మన్ మృతికి నామ నాగేశ్వరరావు సంతాపం

### శేషగిరిరావు మృతి పార్టీకి తీరని లోటు : నామ

**ఖమ్మం ప్రతినిధి మే15 ప్రజా జ్యోతి :** ఖమ్మం జిల్లా బి.ఆర్. ఎస్. పార్టీ సీనియర్ నాయకులు, తల్లాడ మండల తొలి ఎంపీపి, ఖమ్మం జిల్లా మాజీ డీసిఎంఎస్ చైర్మన్, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం జీవితాంతం కృషి చేసిన రాయల వెంకట శేషగిరిరావు అకాల మరణం పట్ల ఖమ్మం ఎం.పి, బి. ఆర్. ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకులు నామ నాగేశ్వర రావు బుధవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. గత 20 సంవత్సరాలుగా తనతో ఉన్న రాజకీయ అనుబందాన్ని గుర్తు చేసుకున్నారు. తెలుగుదేశం పార్టీలో ఉన్నప్పుడు కూడా తనతో కలిసి చేసిన ప్రయాణాన్ని నామ గుర్తు చేసుకుంటూ వారు ఎప్పుడూ రైతాంగ సమస్యల గురించే ఆలోచించే వారన్నారు. ఒక మంచి నాయకున్ని కోల్పోవడం పార్టీకి తీరని లోటన్నారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ వారి కుటుంబ



సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# డివిజన్ నాయకులతో మరియు కార్యకర్తల తోటి తాండ్ర వినోద రావు

**ఖమ్మం మే 15 ప్రజాజ్యోతి:** ఖమ్మం నగరంలోని 25, 26, 37, 39, డివిజన్ ముఖ్య నాయకులు , కార్యకర్తలతోటి ఖమ్మం పార్లమెంటరీ భారతీయ జనతా పార్టీ అభ్యర్థి శ్రీ తాండ్ర వినోద రావు ఆత్మీయ సమావేశము ఘనంగా నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా శ్రీ తాండవినోద రావు మాట్లాడుతూ ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసినా భారతీయ జనతా పార్టీ గెలుపును ఎవరు ఆపలేరని ఖమ్మంలో కూడా కమలం వికసిస్తుందని ధీమా వ్యక్తం చేయడం జరిగినది. ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటానని అన్నారు. ఒక్క అవకాశం వస్తే ఖమ్మం జిల్లా ప్రజలకు ఎల్లవేళలా తన సేవలు అందిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి మారుతి వీరభద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తాండ్ర వినోద రావు సతీమణి శ్రీమతి వినీలా లక్ష్మీ కుమారి, సీనియర్ నాయకులు



గింట్యాల విద్యాసాగర్, మందా సరస్వతి, బోయినపల్లి చంద్రశేఖర్, పిల్లలమర్రి వెంకటనారాయణ, నరేష్, డీకొండ శ్యాంసుందర్, చింతమల్ల వీరస్వామి, దాసరి మధుసూదన్ రావు, డోకుపర్తి రవీంద్ర కుమార్, కొంకిమళ్ళ మృత్యుంజయ రావు, పోలిశెట్టి పద్మావతి, సోడే ధర్మేందర్, ధారా శ్యాము, రామారావు, గోలి ఫణి కుమారి, మన్యం నాగమణి, బండారు శ్రీనివాసరావు, ఆకుల మురళి చౌడవరపు తదితరులు పాల్గొన్నారు.

- నాలుగురోజుల పాటు పాలేరు నియోజకవర్గంలో మంత్రి పొంగులేటి పర్యటన
- ఒక్కో రోజు ఒక్కో మండలం లో..
- 17న ఖమ్మం రూరల్, 18న నేలకొండపల్లి
- 19న తిరుమలాయపాలెం, 20న కూసుమంచి
- ఆయా మండలాల్లోని ప్రతి గ్రామంలో 20 నిమిషాల పాటు సమావేశం
- ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు పొంగులేటి సరికొత్త పంథా




# ప్రజల వద్దకే పాలన

# మాట్లాడుకుందాం రండి

**తిరుమలాయపాలెం, మే 15, ప్రజా జ్యోతి :** రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సరికొత్త పంథాకు శ్రీకారం చుట్టారు. క్యాంపు కార్యాలయానికి బాధితులను రప్పించుకునే అవసరం లేకుండా పాలేరు నియోజకవర్గ ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకునేందుకు ఆయా గ్రామాల్లో పర్యటించనున్నారు. తొలి విడతలో ఈనెల 17 నుంచి 20వ తేదీ వరకు వరుసగా నాలుగు రోజుల పాటు పాలేరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఎంపిక చేసిన పలు గ్రామాల్లో పర్యటించేలా ప్రణాళిక రూపొందించుకున్నారు. 17న ఖమ్మం రూరల్, 18న నేలకొండపల్లి, 19న తిరుమలాయపాలెం, 20న కూసుమంచి మండలాల్లో ఆయన పర్యటన సాగనుంది. ప్రజల వద్దకే పాలన అనే రీతిలోనే. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచి ప్రజల వద్దకే పాలన అందిస్తామని, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ బాధితులు తిరగాల్సిన అవసరం లేదని చెబుతూ వస్తోంది. ఇదే తరహాలో మంత్రి పొంగులేటి సైతం తనను ఎమ్మెల్యేగా గెలిపించి శాసనసభకు పంపించిన పాలేరు నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోవడానికి ప్రజల వద్దకు వెళ్లేలా నిర్ణయం తీసుకున్నారు. నేరుగా కలిసి.. వారు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను తెలుసుకుని వీలైతే అక్కడికక్కడే పరిష్కారం చూపేలా ప్రణాళిక రూపొందించుకున్నారు.

### ఒక్కో గ్రామంలో ఇరవై నిమిషాలు.

పాలేరు నియోజకవర్గ వ్యాప్తంగా నాలుగు మండలాలు ఉండగా ఒక్కో మండలంలో ముప్పైకి పైగా గ్రామాలున్నాయి. కాగా వాటిలో తొలి విడతలో ప్రతి మండలంలో 15 నుంచి 18 గ్రామాల్లో పర్యటించనున్నారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం సైతం స్థానిక ప్రజలతో కలిసి చేసేలా కసరత్తు జరుగుతోంది. ఒక్కో గ్రామంలో ఇరవై నిమిషాల పాటు సమావేశం ఏర్పాటు చేయనున్నారు. ఆ సమావేశంలోనే బాధితుల నుంచి వినతులను స్వీకరించి, సత్వర పరిష్కారం చూపే ప్రయత్నం చేయనున్నారు.

# సీతారామ ప్రాజెక్టు పనులను పరిశీలించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.

## నా జీవిత ఆశయం సీతారామ ప్రాజెక్టు, త్వరలోనే అది నెరవేరబోతుంది.



**ఏన్కూరు ప్రజాజ్యోతి, మే 15:** సీతారామ ప్రాజెక్టు పూర్తి చేసి,రైతులకు సాగునీరు అందించటమే తన జీవిత లక్ష్యం అని,ఆ కల కూడా త్వరలోనే నెరవేరుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఏన్కూరు సీతారామ లింక్ కెనాల్‌ను సందర్శించారు. లింకు కెనాల్ పనులను పరిశీలించారు. త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ...భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు సమీపంలో టన్నెల్ పూర్తయి,పాలేరు రిజర్వాయర్‌లో కలిపితే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 10 లక్షల ఎకరాల భూమి సాగులోకి వస్తుందని తెలిపారు.గోదావరి జలాలు వాడుకున్న మొట్టమొదటి ప్రాజెక్టు అవుతుందని అన్నారు. త్వరలోనే సీతారామ ప్రాజెక్టు పనులు పూర్తయి తన జీవిత ఆశయం,కల నెరవేరుతోందని సంతృప్తి వ్యక్తం చేశారు.ప్రాజెక్టు నిర్మాణానికి భూములు ఇచ్చి సహకరించిన రైతులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.మెయిన్ కెనాల్ పనులు నాలుగు పంప్ హౌస్ లతో పాటు దాదాపుగా అన్ని పనులు పూర్తి అయ్యాయని,పంపు హౌస్ ల ద్వారా లింక్ కాల్వలను సాగర్ కెనాల్ లో కలిపి రైతులకు నీరు అందించడం మొదటి ప్రతిపాదన, ఈ ప్రతిపాదన ద్వారా నాగార్జునసాగర్ కాలువలో కలిపే ఏన్కూరు లింకు కెనాల్ పూర్తయితే ఈ ఏడాదే వైరా ప్రాజెక్టు కింద భూములు సాగులోకి వస్తాయని తెలిపారు.గత ఏడాది లాగా కృష్ణకు నీళ్లు రాకపోయినా గోదావరి జలాలతో కృష్ణ ఆయకట్టును పండించుకోవచ్చునని సూచించారు.అదేవిధంగా వైరా ప్రాజెక్టు కింద తాగునీరు కొరత లేకుండా పోతుందన్నారు.సాగర్ జలాలు రాకపోయినా వైరా,మధిర నియోజకవర్గాలతో పాటు,సత్తుపల్లి లంకాసాగర్ ప్రాజెక్టుకు నీళ్లు తీసుకుపోయే అవకాశం ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, జిల్లా పార్టీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్,సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు,తుమ్మల ముఖ్య అనుచరుడు గుత్తా వెంటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు స్వర్ణ నరేంద్ర కుమార్,ఏ బ్లాక్ అధ్యక్షులు వేముల కృష్ణ ప్రసాద్,మండల నాయకులు మేడి కొండూరు ప్రసాద్, మేడ ధర్మారావు, కొనకంచి రామకృష్ణ, వాసిరెడ్డి నాగేశ్వరరావు, స్వర్ణ ప్రహ్లాదరావు, చందమామ నర సింహారావు, ముక్తి వెంకటేశ్వర్లు, నల్లమల శివకుమార్,ఆది నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు నష్టపరిహారం చెల్లించాలి.



**ఏన్కూర్, ప్రజాజ్యోతి, మే 15 :** బుధవారం మండలంలోని హిమంనగర్ నుండి ఏనుకురు ఎం ఎస్ పి కాల్వ వరకు జరుగుతున్న సీతారామ ప్రాజెక్ట్ లింక్ కెనాల్ పనుల పరిశీలనకు వచ్చిన రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నీ మండల సిపిఐ నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి జాగర్లమూడి రంజిత్ కుమార్ మాట్లాడుతూ ఈ కాల్వ క్రింద భూములు కోల్పోయిన రైతులకు మార్కెట్ ధరలకు అనుగుణంగాఒక ఏ కరానికి 30లక్షలు నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. ఈ కాల్వ క్రింద భూములు కోల్పోయిన రైతుల వివరాలు, ఎంత భూములు కోల్పోతున్నారు అనే వివరాలు ఇంకా అధికారులు ప్రకటించకుండా, పనులు జరగడం తో రైతుల్లో ఆందోళన నెలకొన్నదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కి తెలియజేసినారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చినారు. ఈ కార్యక్రమం లో సీపీఐ జిల్లా సమితి సభ్యులు అమరనేని వీరభద్రమ్, సీనియర్ నాయకులు మేడ భూషయ్య, ఏఐటీయూసీ జిల్లా నాయకులు మంకెన కృష్ణ,రైతు నాయకులు తాళ్లూరి రమణ,భూములు కోల్పోతున్న రైతులు పాల్గన్నారు.

# పలువరుకి పరామర్శ,నివాళులు



**చింతకాని మే 14 ప్రజా జ్యోతి:** చింతకాని మండలం లో శ్రీమతి మల్లు నందిని విక్రమార్క తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు శ్రీ భట్టి విక్రమార్క మల్లు గారి సతీమణి,అమ్మా ఫౌండేషన్ చైర్మన్ శ్రీమతి మల్లు నందిని విక్రమార్క గారు చింతకాని మండలం లో పర్యటించారు, తిమ్మినేని పాలెం గ్రామ కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ నభి గారి భార్య సమీనా గారు అనారోగ్యంతో బాధపడుతుంటే వారి ఇంటికి వెళ్లి వారి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు త్వరగా కోలుకోలుకొని ఆకాంక్షించారు. అనంతరం నాగులవంచ గ్రామానికి చెందిన అంబటి శాంతయ్య గారి తండ్రి గారు ప్రముఖ స్వాతంత్ర సమర యోధులు అంబటి వెంకటయ్య గారి దశ దిన కర్మలో పాల్గొని వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు వారి మృతి పట్ల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమాల్లో వారి వెంట చింతకాని మండల కాంగ్రెస్ నాయకులు,ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు ఉన్నారు

# ఆరోగ్య ఉప కేంద్రానికి కుర్చీల వితరణ.



**కారేపల్లి, మే 15, ప్రజాజ్యోతి:** సింగరేణి మండల పరిధిలోని విశ్వనాధపల్లి ప్రాధమిక ఆరోగ్య ఉప కేంద్రానికి విశ్వనాధపల్లి కి చెందిన షేక్ పెద్ద షరీఫ్ కూర్చీలను బుధవారం వితరణ చేశారు. తన తండ్రి నవాబ్ జ్ఞాపకార్ధం 10 కూర్చీలను షేక్ పెద్ద షరీఫ్ ఉప కేంద్రం వైద్యురాలు డాక్టర్ మహేశ్వరి కి అందజేశారు. ఈ సందర్భంగా షరీఫ్ ను విశ్వనాధపల్లి గ్రామ ప్రజలు అభినందించారు, వైద్యురాలు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామానికి అవసరమైన సేవ కార్యక్రమాలు చేయటానికి దాతలు షరీఫ్ ను ఆదర్శంగా తీసుకుని ముందుకు రావాలని పెద్దలు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వల్లభనేని ప్రభాకర్ రావు, తాతా వెంకటేశ్వర్లు, వల్లభనేని మురళీ, ఏఎన్ఎం అంజలీ తదితరులు పాల్గొన్నారు.

## మూగబోయిన మృదువైన గాత్రం..



**తల్లాడ, మే 15 (ప్రజా జ్యోతి న్యూస్):** ఆయన మాటల్లో సుస్పష్టత, అన్ని విషయాలపై పూర్తి అవగాహన, ఎటువంటి వేదికలపైన అయినా అలవోకగా, క్షుణ్ణంగా అందరికీ అర్ధమయ్యే రీతిలో మాట్లాడే గాత్రం ఒక్కసారిగా మూగబోయింది. ఆయన మాట్లాడితే వినాలనుకునే వారికి ఇక అవకాశం దక్కే వీలులేదు. ఆరడుగుల నిలువెత్తు రూపం, ఆజానుబాహుడు, మాజీ డిసిఎంఎస్ చైర్మన్, తల్లాడ తొలి ఎంపీపీ రాయల శేషగిరి రావు ఇకలేరు. ఆయన ప్రసంగిస్తున్నప్పుడు ప్రతిఒక్కరు సైలెంట్ గా వినాల్సిందే. రాజకీయ చలోక్తులు విసరడంలో కూడా దిట్ట. తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో అనర్గళంగా మాట్లాడే సామర్థ్యం ఉన్న రాజకీయ నాయకుడు రాయల. అనేకమంది రాజకీయ ప్రముఖులతో సంబంధాలు కలిగి ఉండటంతో ఉమ్మడి జిల్లా ప్రజలకు ఆయన సుపరిచితులు. ఆయన మన మధ్య లేకపోయినప్పటికీ ఆయన గాత్రం మాత్రం ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలుస్తుందటంలో ఎటువంటి సందేహం లేదు.ం

## విద్యుత్ కు అంతరాయం

**సత్తుపల్లి, మార్చి 15:(ప్రజా జ్యోతి) :** సత్తుపల్లి 33/11 కె.వి సబ్ స్టేషన్ నిర్వహణ కారణంగా సబ్ స్టేషన్ పరిధిలోని సత్తుపల్లి టౌన్, కిష్టారం, కాకర్లపల్లి గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని దీనికి వినియోగదారులు సహకరించాలని ఆ శాఖ ఏ.ఈ శరత్ ఒక ప్రకటనలో తెలిపారు.



## బాదావత్ సాకుకు ఘన నివాళులు



**ఖమ్మం మే 15 ప్రజా జ్యోతి:** మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ (ఆసిఫాబాద్) శంకర్ నాయక్ మాతృమూర్తి బాదావత్ సాకు పెద్దకర్మ బుధవారం మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం లచ్య తండా (గొల్ల చర్ల)లో జరుగగా పలువురు పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు. వైరా మాజీ ఎమ్మెల్యే మదన్ లాల్, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోతు బద్రు నాయక్, నాయకులు రవీంద్ర నాయక్, వీరన్న నాయక్, వీరనారి మణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భుఖ్య ఉపేంద్ర బాయి, నాయకులు జ్యోతి, చందు తదితరులు బాదావత్ సాకు పెద్ద కర్మలో పాల్గొని, ఆమె చిత్రపటానికి పూలమాలలు సమర్పించి, ఘనంగా నివాళు లర్పించారు .

## ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించుకోవాలి

- ప్రతి ఒక్క కాంగ్రెస్ నాయకులు , కార్యకర్త కంకణం కట్టుకోవాలి
- మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలుపుకు సహకరించాలి
- 48వ డివిజన్ కాంగ్రెస్ నాయకులు అల్లే సాయికిరణ్



**ఖమ్మం మే 15 ప్రజాజ్యోతి.:** ప్రశ్నించే గొంతుక నిత్యం ప్రజల సమస్యలపై పోరాడే వ్యక్తి , గత ప్రభుత్వంలో జరిగిన అరాచకలను ఎప్పటికప్పుడు ప్రజల ముందు నుంచి నిజమైన జర్నలిస్టుగా ప్రజలకు వివరించిన తీన్మార్ మల్లన్న ను కాంగ్రెస్ పార్టీ గుర్తించి ఖమ్మం - నల్గొండ - వరంగల్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నియమించడం చాలా సంతోషకరమైన విషయం అని. దీనిలో భాగంగానే ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులను గుర్తించి ప్రతి ఒక్క కాంగ్రెస్ నాయకులు , కార్యకర్త సైనికుల పనిచేస్తూ తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఎమ్మెల్సీ ఓట్లు వేసే విధంగా సహకరించాలని ఖమ్మం 48వ డివిజన్ కాంగ్రెస్ నాయకులు అల్లే సాయికిరణ్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు , కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

# వైద్యం కోసం వెళ్తూ అనంత లోకాలకు వృద్ధ దంపతులు

- ప్రాణాలు తీసిన అతి వేగం
- చావులోని వీడని బంధం
- చెట్టును ఢీకొనీ కారు ప్రమాదంలో ఇద్దరు వృద్ధ దంపతులు మృతి
- మరో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు





**బోనకల్, మే 15, ప్రజాజ్యోతి:** కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో ఇద్దరు వృద్ధ దంపతులు అక్కడికక్కడే ప్రాణాలు విడిచిన ఘటన మండల పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే ఖమ్మం పట్టణంలోని మామిళ్లగూడెంకు చెందిన విశ్రాంత జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ కొత్తూరు సూర్యనారాయణ,రుక్మిణి దంపతులు,మరో ఇద్దరు యువకులు మధిర నుంచి ఖమ్మం హాస్పిటల్ లో వైద్యం కోసం కారులో ప్రయాణిస్తున్నారు.ఇదే క్రమంలో కారు బోనకల్ దాటి ముష్టికుంట్ల చేరుకునే లోపే అతి వేగం వారిని తిరిగి రాని లోకాలకు తీసుకెళ్ళింది.కారు అదుపుతప్పి చెట్టును బలంగా ఢీకొట్టడంతో కారు నుజ్జు నుజ్జు అవ్వడమే కాకుండా కారులోని వృద్ధ దంపతులైన సూర్యనారాయణ,రుక్మిణిలు అక్కడికక్కడే మృతి చెందారు.కారులో ఉన్న మరో ఇద్దరు యువకులు తీవ్ర గాయాలపాలై అపస్మారక స్థితిలో పడి ఉన్నారు.ప్రమాదాన్ని గమనించిన స్థానికులు అక్కడికి చేరుకొని కారు డోర్ లాకై గాయాలపాలైవున్న ఇద్దరు యువకులని,అప్పటికే మరణించి ఉన్న వృద్ధులను కారు అద్దాలు పగలగొట్టి బయటకు తీశారు.అప్పటికే ఇంజన్లో మంటలు వస్తుండడంతో ఫైర్ ఇంజిన్ కి సమచారం అందించారు.15 నిమిషాల్లోనే కారు పూర్తిగా దగ్ధమైంది.స్థానికులు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి మధిర సీఐ మధు,ఎస్సై కడగండ్ల మధు బాబుతో కలిసి పరిశీలించడం జరిగింది.ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకోనీ దర్యాప్తు ప్రారంభించారు.క్షతగాత్రులను ఖమ్మం ఆసుపత్రికి తరలించారు.సమాచారం అందుకున్న తన కుమార్తె తల్లీదండ్రుల మృత దేహాలను చూసి గుండెలు పగిలేలా రోధించింది.తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కారు లో పడి ఉన్న వారిని బయటకి తీసేందుకు కృషి చేసిన 108సిబ్బందిని, మాజీ ఎంపీపీ తుళ్ళూరు రమేశ్ ను పలువురు అభినందించారు.

## స్ట్రాంగ్ రూముల వద్ద భద్రతా ఏర్పాట్లు పటిష్టం చేశాం జిల్లా కలెక్టర్ వి పి గౌతం





**ఖమ్మం ప్రతినిధి మే 15 ప్రజా జ్యోతి:** స్ట్రాంగ్ రూం ల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. బుధవారం రిటర్నింగ్ అధికారి, ఖమ్మం రూరల్ మండలం, పొన్నెకల్ లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూం లను సందర్శించి, భద్రతను పరిశీలించారు. 7 అసెంబ్లీ సెగ్మెంట్లకు ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూం లను పరిశీలించి, విధుల్లో ఉన్న సాయుధ బలగాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్ట్రాంగ్ రూం ల వద్ద ఏర్పాటుచేసిన లైట్లు 24 గంటలు ఆన్ లో ఉంచాలన్నారు. స్ట్రాంగ్ రూం సిసి కెమెరాల వ్యూ కోసం ఏర్పాటుచేసిన ఎల్ఇడి తెరలను పరిశీలించి, విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. స్ట్రాంగ్ రూం ల పరిశీలనకు ఎంట్రీ పాస్ ఉన్న అభ్యర్థులు, ఏజెంట్లకు అనుమతించాలని ఆయన తెలిపారు. కౌంటింగ్ రూంల ఏర్పాటు పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. నిరంతరం అప్రమత్తంగా వుంటూ, భద్రతా చర్యలు చేపట్టాలని రిటర్నింగ్ అధికారి అన్నారు. ఈ సందర్భంగా శిక్షణ ఐపిఎస్ పి. మౌనిక, అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, అదనపు డిసిపి ప్రసాదరావు, ఆర్ అండ్ బి ఎస్ఇ శ్యామ్ ప్రసాద్, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు, అధికారులు తదితరులు ఉన్నారు.

## రాయల వెంకట శేషగిరిరావు మృతికి సంతాపం తెలిపిన బిఆర్ఎస్ నాయకులు

**ఖమ్మం మే 15 ప్రజాజ్యోతి:** ఖమ్మం జిల్లా మాజీ డిసిఎంఎస్ ఛైర్మెన్ రాయల వెంకట శేషగిరిరావు పార్థివ దేహాన్ని సందర్శించి నివాళు లు అర్పించిన ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, కొండబాల కోటేశ్వరరావు, జడ్పీ చైర్మన్ కమల్ రాజ్

**-సంతపం తెలిపిన రాజ్యసభ సభ్యులు బండి పార్థసారథి రెడ్డి**

ఖమ్మం జిల్లా మాజీ డీసీఎంఎస్ చైర్మన్ శ్రీ రాయల వెంకట శేషగిరిరావు అకాల మరణ వార్త తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ నేతలు ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, %మీజ% తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, కొండబాల కోటేశ్వరరావు, జడ్పీ చైర్మన్ కమల్ రాజ్ హుటా హుటిన సికింద్రాబాద్ యశోద హాస్పిటల్ చేరుకొని వారి పార్థివ దేహాన్ని సందర్శించారు. వారి అకాల మరణం పట్ల చింతిస్తున్నట్లు తెలిపారు. మంచి నాయకుడిని కోల్పోయామని వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. వారి మరణం పట్ల రాజ్యసభ సభ్యులు బండి పార్థసారథి రెడ్డి ప్రగాఢ సంతాపాన్ని తెలిపి వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



# కులనిర్మూలన సిద్ధాంత వైతాళికుడు మారోజు వీరన్న

- కాకి భాస్కర్, బహుజన కమ్యూనిస్టు పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి పొడకండి రాంబాబు
- భవిష్యత్తు కాలాన్ని ప్రభావితం చేసిన కామ్రేడ్ మారోజు వీరన్నకు విప్లవ జోహార్లు




**ఖమ్మం, మే 15 ప్రజా :** కులనిర్మూలన సిద్ధాంత వైతాళికుడు మారోజు వీరన్న అని మాజీ పి.డి.ఎస్.యూ నాయకులు కాకి భాస్కర్, బహుజన కమ్యూనిస్టు పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి పొడకండి రాంబాబులు అన్నారు. ఖమ్మం నగరంలోని ఖానాపురం హవేలీలో లింగనబోయిన లక్ష్మణ్ అధ్యక్షతన పూలే అంబేద్కర్ అధ్యయన వేదిక కార్యాలయంలో బుధవారం మే 16 మారోజు వీరన్న వర్ధంతి సందర్భంగా కరపత్రాన్ని ఆవిష్కరించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పీ.డి.ఎస్.యు మాజీ నాయకులు కాకి భాస్కర్ హాజరై మాట్లాడుతూ... మారోజు వీరన్న ఓ సిద్ధాంతకర్త అని అతను ఈ దేశాన్ని విముక్తి చేసే సిద్ధాంతాన్ని రాశాడని అన్నారు. ఆనాడు లెనిన్ రష్యాలో ఏం చేయాలని రాస్తే, మారోజు ఇండియాలో ఏం చేయాలని ఓ పుస్తకాన్ని రాశాడన్నారు. సాంప్రదాయ కమ్యూనిస్టులను చీల్చి చెండాడారన్నారు. ఈ దేశంలో కులం ఉందని ఇది కులవర్గ సమాజమని, మీరు మాత్రం వర్గ సమాజం అనడం వెనక పెద్ద కుట్ర దాగి ఉందని, మీరంతా అగ్రకులాలే, పార్టీలో నిర్ణయాలు చేసే అధికారంలో ఉండబట్టే మీరు పూలే, అంబేద్కర్ లను విస్మరించారన్నారు. అందుకే ఈ దేశంలో విప్లవం విజయవంతం కావడం లేదని ఆ పార్టీలను ప్రజల సమక్షంలో ఎండగట్టాడన్నారు. అంతా మాత్రమే కాదు అణగారిన కులాలను కూడగట్టి సంఘాలను నిర్మించి ఈ రాజ్యంపై తిరుగుబాటు చేయించిన కులనిర్మూలన సిద్ధాంత వైతాళికుడు కామ్రేడ్ మారోజు వీరన్న అని కొనియాడారు. దళిత బహుజన పితామహుడని అంతటి మహనీయుని చంద్రబాబు పొట్టన పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తపరిచారు. బహుజన కమ్యూనిస్టు పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోడకండి రాంబాబు మాట్లాడుతూ... 1996 ప్రాంతంలోనే సామాజిక తెలంగాణ కోసం గళం విప్పిన వాడు మారోజు వీరన్న అన్నారు. చిన్న రాష్ట్రాల్లోనే అణగారిన కులాలకు అభివృద్ధి జరుగుతుందని చెప్పిన అంబేద్కర్ మాటలను కొనసాగింపుగా సామాజిక తెలంగాణ పేరుతో 3000 సభలు నిర్వహించి సూర్యాపేటలో ఆగస్టు 10, 1997న భారీ బహిరంగసభను నిర్వహించి తెలంగాణ ప్రజల్లో ఉన్న రాష్ట్ర కాంక్షను ఈ సమాజానికి చూపించాడన్నారు. ఈ ప్రభంజనం చూసి తట్టుకోలేక ఆంధ్ర కమ్మ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు మారోజును ఇలానే వదిలేస్తే పెద్ద నష్టమే జరుగుతుందని బావించి అత్యంత కిరాతకంగా మారోజుని హత్య చేయడం జరిగినదని ఆరోపించారు. ఆ దుర్మార్గులు మారోజుని భౌతికంగా దూరం చేశారేమో కానీ దళిత బహుజన జాతుల్లో ఏప్పటికి బ్రతికే ఉంటాడని అన్నారు. ఈ కార్యక్రమంలో మాల గుతప్పదెబ్బ రాష్ట్ర అధ్యక్షులు ధారా వెంకయ్య, సేవాలాల్ నాయకులు బానోత్ కిషన్ నాయక్, కంటెస్టింగ్ పార్లమెంట్ అభ్యర్థి ఆంతోని సురేష్ దక్కలి, కొంగర శ్రీను, కుమ్మరి ప్రభాకర్ తదిరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికకు బ్యాలెట్ బాక్సులు సిద్ధం

**రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ దాసరి హరిచందన**

నీలగిరి, మే 15 : వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించి బ్యాలెట్ బాక్స్‌లు సిద్ధం చేసినట్లు రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ దాసరి హరిచందన తెలిపారు. బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం నుంచి వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఉప ఎన్నిక నిర్వహణపై అధికారులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లగొండ నుంచి ఆమె పాల్గొని ఎన్నికల నిర్వహణపై ఎన్నికల అధికారులకు వివరించారు. శాసన మండలి ఉప ఎన్నిక నిర్వహణకు సరిపడా బ్యాలెట్ బాక్సులు సిద్ధంగా ఉన్నాయని, ఎన్నికల కోడ్ ఉల్లంఘన, అనుమతులు, ఎన్నికల ప్రచారం, ఎన్నికల ర్యాలీలు, అభ్యర్థులు పాటించాల్సిన విషయాలు, పాటించకూడని అంశాలపై అభ్యర్థులకు బుధవారం జరిగిన సమావేశంలో అవగాహన కల్పించినట్లు తెలిపారు. బ్యాలెట్ పేపర్లు, పోస్టల్ బ్యాలెట్లకు సంబంధించి ఏఆర్ఓలు ఎప్పటికప్పుడు రిజిస్టర్ నిర్వహించాలని, అభ్యర్థులకు అనుమతులు మ్యానువల్‌గా ఇవ్వాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల లాగానే ఎఫ్ఎస్‌టీ బృందాలు కొనసాగుతాయని తెలిపారు. బ్యాలెట్ బాక్స్‌లు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, శిక్షణ కార్యక్రమాల నిర్వహణపై పలు సూచనలు చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు ఎన్నికల అధికారులు సర్ఫరాజ్ అహ్మద్, లోకేశ్‌కుమార్, డిప్యూటీ సీఈఓ సత్యవాణి, చండూరు ఏఆర్ఓ సుబ్రహ్మణ్యం, మిర్యాలగూడ ఏఆర్వో శ్రీనివాసరావు పాల్గొన్నారు.






## వ్యర్థాల కాల్చివేత అనర్థం

**సాగు భూమిలో సారం కోల్పోయే ప్రమాదం  మిత్ర పురుగులు మరణిస్తే చేనుకు మరింత నష్టం**

**సేంద్రియ ఎరువుల వినియోగమే మిక్కిలి శ్రేష్టం సారం పెంపుదలే అధిక దిగుబడులకు సరైన మార్గం**

**చేలల్లో చెత్తను కాల్చవద్దంటూ నిపుణుల స్పష్టం**

కూసుమంచి, మే 15 : ఇప్పటికే విచ్చలవిడిగా వినియోగిస్తున్న రసాయన ఎరువులతో సాగు భూమి రోజురోజుకూ తన సారాన్ని కోల్పోతోంది. ఈ తరుణంలో రైతులు తమ పంటల వ్యర్థాలను చేలలోనే కాల్చుతుండడంతో మరింత ప్రమాద ఏర్పడుతోంది. పంటలకు మేలు చేసే పురుగులు భూమిలోనే నివసిస్తుంటాయి. సాగు సమయంలో అవి మేల్కొని విత్తనాలను, వేర్లను ఆశించే క్రిమికీటకాలను సంహరించి ఆరగిస్తుంటాయి. ఇలా పంటలకు ఎంతో మేలు చేకూరుస్తాయి. కానీ.. సహజంగానే వేసవిలో రైతులు పంటల వ్యర్థాలను చేనులో ఒక చోట చేర్చి కాల్చివేస్తుంటారు. కొన్ని పంటలనైతే ఎక్కడివి అక్కడే ఉంచి నిప్పు అంటిస్తుంటారు. దీంతో ఆ మంటలు చేను అంతటా విస్తరించడంతో సాగు భూమిలోని అన్నిచోట్లా ఉన్న మిత్ర పురుగులు చనిపోతున్నాయి. దీంతో తదుపరి సాగు సమయంలో క్రిమికీటకాలు, తెగుళ్లు ఎక్కువై పంటల దిగుబడి గణనీయంగా తగ్గిపోతోంది. దీంతో రైతులు ఎంతగా శ్రమించినప్పటికీ ఆర్థికంగా నష్టపోతున్నారు. పంటల దిగుబడి పెరగాలన్నా.. చీడపీడలు ఆశించకుండా ఉండాలన్నా ముఖ్యంగా సాగుభూమి సారవంతమైనదై ఉండాలి. బలమైన ఖనిజ లవణాలు, పంటలకు మేలుచేసే మిత్ర పురుగులు పుష్కలంగా ఉండేలా చూసుకోవాలి. అందుకోసం పంటలు అయిపోయిన తరువాత వ్యర్థాలను తొలగించుకోవాలి తప్ప కాల్చకూడదు. వేసవిలో తొలగించడం సాధ్యం కాకపోతే తొలకరి రోజుల్లో భూమి తడిసిన తరువాత వ్యర్థాలను పూర్తిగా తీసివేయాలి. లేకుంటే నీళ్లు పెట్టి కుళ్లిన తరువాత భూమిలో కలియదున్నాలి.